క్లుప్తంగా

బీటీ రోడ్డు నిర్మించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మాదాయిపల్లి గ్రామస్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లి నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలోని జగ్‌బోయినపల్లి వరకు బీటీ వేయాలని మాదాయిపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడారు. వర్షా కాలంలో ఈ ప్రాంతం నుంచి వెళ్లాలంటే నరకాన్ని తలపిస్తోందని, కురిసిన వర్షానికి మట్టి కొట్టుకుపోయి రోడ్డంతా గుంతలమయంగా మారుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గుంతల్లో నీరు చేరి రోడ్డంతా బురదమయమై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ఎమ్మెల్యేకు విన్నవించారు. బురదమయమైన రోడ్డు నుంచి పాఠశాలలకు వెళ్లాలంటే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పోయే దారి లేక ఒక్కోసారి వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ సత్యనారాయణ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఎంపీడీవో సుజాత

కడ్తాల్: మండల కేంద్రంలోని ఎస్వీఎస్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కొంగరకలాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 9 గంటలకు ఎస్వీఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. తమ వెంట రెస్యూమ్‌తో పాటు, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా తదితర జిరాక్స్ సర్టిఫికెట్‌లు, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పాన్‌కార్డు తీసుకొని రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9010111178, 9640714704, 8341924283, 6300400852 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా కడారి రామకృష్ణ



రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: బీఆర్ఎస్ కడ్తాల్ పట్టణ అధ్యక్షుడిగా మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల పరిధిలోని మైసిగండి గెస్ట్‌హౌస్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పట్టణ బీఆర్ఎస్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా గూడెపు మహేశ్, మీడియా కోఆర్డినేటర్‌గా రాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్, వీరయ్య, నర్సింహ, రాంచంద్రయ్య, లక్ష్మణ్‌చారి, మహేశ్, వెంకటేశ్, శ్రీకాంత్, మహేశ్,ఇర్షాద్, అంజి, జంగయ్య పాల్గొన్నారు.

తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి

ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య

తలకొండపల్లి: తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య పేర్కొన్నారు. పాఠశాలల బలోపేతం చేయాలంటే తరగతికి ఒకరిని నియమించాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరిట ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పంపియ్యొదని సూచించారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారనే సాకుతో ఉపాధ్యాయులను ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు పంపిస్తే స్కూల్ మూతపడే ప్రమాదముందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం ప్రకారం తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సి ఉండగా, 1 నుంచి 30 మంది విద్యార్థులకు ఒకరు, 30 నుంచి 60మందికి ఇద్దరు టీచర్లు, 60 నుంచి 90 మందికి ముగ్గురు టీచర్లు, 91 నుంచి 120 వరకు నలుగురు టీచర్లు ఉండాలని ప్రభుత్వం ఆర్డర్స్ జారీ చేస్తున్నారనే విషయం తనదృష్టికి వచ్చిందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



క్రీడాపోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

చదువుతో పాటు క్రీడలు అవసరం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు ప్రారంభం

కడ్తాల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంతో పాటు క్రీడల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తుందన్నారు. గ్రామీణ క్రీడాకారులు రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు, ఉన్నత చదువులు చదివేందుకు ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తే ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతిమణి కసిరెడ్డి మాధవి, ఎంఈఓ బాసునాయక్, జోనల్ కార్యదర్శి భీముడు, నోడల్ అధికారి జంగయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, జహంగీర్‌అలీ, చేగూరి వెంకటేశ్, శేఖర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, ఇమ్రాన్ జీహెచ్ఎం శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, భాగ్యలక్ష్మి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

- మాజీ సర్పంచ్ బక్కి కుమార్

తలకొండపల్లి: పీఎం విశ్వకర్మ కౌసల్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకొని పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యమని మాజీ సర్పంచ్ బక్కి కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చంద్రధనలో పీఎం విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా బక్కి కుమార్ మాట్లాడారు. హస్త కళాకారులతో పాటు, చేతి వృత్తిదారులకు ప్రోత్సాహానిచ్చేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సులభతర రుణాలు, నైపుణ్య శిక్షణ, ఆధునిక యంత్ర పరికరాలు అందజేయడమే కాకా, డిజిటల్ లావాదేవీల కోసం ప్రోత్సాహకాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 18 ట్రేడ్‌లలో నిమగ్నమైన చేతివృత్తుల వారు, కళాకారులు స్వయంగా పని చేసుకుంటూ ఆర్థికంగా లబ్ధి పొందుతారన్నారు. దీనికోసం రూ.3 లక్షల వరకు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్) వీఎల్ఈ (విలేజ్ లెవల్ ఎంటర్ ప్రీన్యూయర్) పవన్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న వీఎల్ఈలు తదితరులు



మంత్రి దామోదర రాజనర్సింహతో గుజ్జుల మహేష్ తదితరులు

నిధులు మంజూరు చేయాలని వినతి

తలకొండపల్లి: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి దామోదర రాజనర్సింహ నివాసంలో గుజ్జుల మహేష్ మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలు పరిష్కరించాలని మంత్రి దృష్టికి తెచ్చారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పూర్తిగా శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉందన్నారు. స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడాయన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది, రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో స్పందించి వెంటనే నిధులు మంజూరు చేయించి నూతన భవనం నిర్మించాలని మంత్రితో చెప్పారు. ఈ విషయంలో స్పందించిన మంత్రి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల మల్లేష్ గౌడ్, చినుకుంట్ల జంగయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన గణేశ్ ఉత్సవాలు

- రూ. 7లక్షలు పలికిన జేఆర్ ఫ్రెండ్స్ లడ్డూ ప్రసాదం

ఇబ్రహీంపట్నం: మైక్ సౌండ్ రికార్డులు, లైటింగ్‌లు ఆటపాటల నడుమ అట్టహాసంగా గణేశ్ ఉత్సవాలు ముగిసాయి. శనివారం ఉదయం వరకూ శేరిగూడ, తట్టిఖానా చెక్ డ్యాంలో నిమజ్జనం చేశారు. ఇబ్రహీంపట్నంలోని శ్రీరాంనగర్ కాలనీలో జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ 13 రోజులపాటు నెలకొల్పిన మండపంలోని వినాయకుడి పెద్ద లడ్డూ ప్రసాదం కొంగరకలాన్‌కు చెందిన లక్కరాజు ప్రశాంత్ కుమార్ వేలంలో రూ. 7లక్షలకు దక్కించుకున్నారు. చిన్న లడ్డూ ప్రసాదాన్ని వేలంలో కొత్త గణేశ్‌గౌడ్ రూ. 3.65లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన భజన పోటీల్లో పోచారం గ్రామం టీం ప్రథమ, కొంగర కలాన్ టీం ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. రామాయణం, భగవద్గీత వ్యాసరచన పోటీల్లో దీక్షిత, తెలుగు పద్యాల పోటీల్లో కీర్తి బహుమతులు అందుకున్నారు. ముగ్గుల పోటీల విజేతలకు పట్టు చీరలను ప్రదానం చేశారు.

హాజరైన ఎమ్మెల్యేలు

జేఆర్ ఫ్రెండ్స్ వినాయక నిమజ్జనోత్సవానికి హాజరైన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ప్రశాంత్‌రెడ్డికి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. వివిధ పోటీల్లో విజయం సాధించిన వారికి స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతితో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఫోక్ సింగర్ తేజు ప్రియా, ఉషారాణి, బాలీవుడ్ సింగర్స్‌తో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

త్రిశక్తి కాలనీ లడ్డూ రూ.1.17లక్షలు

ఇబ్రహీంపట్నం త్రిశక్తి కాలనీలో నెలకొల్పిన మండపం వద్ద వినాయకుడి పెద్ద లడ్డూ ప్రసాదం వేలంలో రూ.1.17లక్షలకు జిట్టా అశోక్‌వర్ధన్‌రెడ్డి, చిన్న లడ్డూ ప్రసాదాన్ని రూ.78 వేలకు కంబాలపల్లి యాదగిరిరెడ్డిలు దక్కించుకున్నారు. ఈ మండపాన్ని దర్శించిన ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణలను కాలనీ ఫౌండర్ కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, సాంస్కృతిక కార్యదర్శి శేఖర్‌రెడ్డిలు సన్మానించారు. పవన్‌పురి కాలనీలో నెలకొల్పిన శివాజీ బాలల సంఘం మండపంలోని వినాయక లడ్డూ వేలంలో రూ. 18 వేలకు శ్రీశైలం దక్కించుకున్నారు.



లడ్డూ ప్రసాదాన్ని ప్రశాంత్‌కుమార్‌కు అందజేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



విజేత కీర్తికి సైకిల్‌ను బహూకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

కొండా లక్ష్మణ్ ఆశయ సాధనకు కృషి

ఆమనగల్లు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం పద్మశాలిసంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పద్మశాలీసంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవిత్యాగం చేసి ఉద్యమించిన మహా నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలిసంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణయ్య, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు మామిడిశెట్టి రవి, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, శివలింగం, వెంకటేశ్, అప్పం శ్రీను, ఎంగలి రమేశ్, ఈశ్వరయ్య, శ్రీను, వాసు, గంజి శ్రీను, ఎంగలి ప్రసాద్ పాల్గొన్నారు.



ఆమనగల్లు: కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పద్మశాలిసంఘం నాయకులు

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి



ఇబ్రహీంపట్నం: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం: దండుమైలారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రత కోసం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, ఏపీడీ సక్రియనాయక్, ఏపీఓ తిరుపతచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌లు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలని ఎంపీడీఓ శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మహిళా సమాఖ్య సభ్యులు, ఏపీఎం శ్రీదేవి ఆధ్వర్యంలో కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవహారం, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పించారు. ఎంపీఓ రఘు, ఎస్ఓ రేణుక, ఉపాధ్యాయురాలు యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కె. అమరేందర్ రెడ్డి కోరారు. మున్సిపల్ సిబ్బంది పలు వార్డుల్లో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంజాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, బయో మెడికల్ వేస్ట్ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించారు.



తలకొండపల్లి: కేజీబీవీ మానవహారంలో ఎంపీడీఓ శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు



తుర్కయంజాల్: ఇంజాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

ఫార్మాసిటీ రద్దుకు పోస్టుకార్డు ఉద్యమం



కుర్మిద్ద తపాలా కార్యాలయంలో అధికారికి పోస్టుకార్డులను అందజేస్తున్న రైతులు

యాచారం: ఫార్మాసిటీని రద్దు చేయాలని కోరుతూ తాడిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి గ్రామాల రైతులు పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారం రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డికి ఫార్మాసిటీని రద్దు చేయాలని పోస్టు కార్డులు పంపామన్నారు. శనివారం యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, కేంద్రంలోని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి పోస్టుకార్డు ద్వారా తమ నిరసనను వ్యక్తం చేశామని చెప్పారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని, ఈ విషయంలో తెలంగాణ సీఎంకి వెంటనే ఆదేశాలు జారీ చేయాలని పోస్టుకార్డుల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

మహాలక్ష్మి సబ్సిడీ పత్రాల పంపిణీ



సబ్సిడీ పత్రాలు పంపిణీ చేస్తున్న గ్రామ కార్యదర్శి విజయ

ఆమనగల్లు: శంకరకొండ తండాలో శనివారం పలువురు మహిళలకు మహాలక్ష్మి పథకం క్రింద మంజూరైన గ్యాస్‌సిలిండర్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. శంకరకొండ తండాలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు గ్రామ కార్యదర్శి విజయ సబ్సిడీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్‌రాథోడ్, రేషన్‌డీలర్ కృష్ణ, లక్ష్మణ్, చంద్రు, హనుమంతు, ఆంజనేయులు, లచ్చు, బాలు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలని వినతి



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌పీఆర్డీ నేతలు

ఇబ్రహీంపట్నం: ఎంఎస్ఎంఈ 2024 పాలసీలో వికలాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నేతలు కలెక్టర్ శశాంకకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు, కోశాధికారి శ్రీనివాస్‌లు మాట్లాడారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు–2024 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకొచ్చి రూ. 4వేల కోట్ల నిధులు కేటాయిస్తుందని,వికలాంగులను విస్మరించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం బాధాకరమన్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్ట ప్రకారం తమకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో తమకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

ఎర్రం చెరువు పరిధి గుర్తింపు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం జిల్లేడ్ గ్రామ శివారులో గల ఎర్రం చెరువు శిఖం భూమిని శనివారం ఇరిగేషన్ ఏఈ సింధు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో సర్వేయర్ ఆంజనేయులు కొలతలు చేసి చెరువు పరిధిని గుర్తించారు. ఈ సందర్భంగా సర్వేయర్ ఆంజనేయులు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 145లో 9 ఎకరాల 17 గుంటల శిఖం భూమి ఉందని తెలిపారు. చెరువు భూమి అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు కొలతలు చేసి హద్దులు నిర్ణయిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న శ్రీధర్‌రెడ్డి, తదితరులు

- జిల్లా అధికార ప్రతినిధి కందూరు శ్రీధర్‌రెడ్డి

షాబాద్: బీజేపీ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు ప్రతి బూత్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా అధికార ప్రతినిధి కందూరు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చెప్పారు. 10 ఏళ్ల కాలంగా బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి తెలియజేసి పార్టీలో చేర్పించాలని సూచించారు. చేవెళ్లలో అత్యధిక పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల వరకు బీజేపీ క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్, ప్రధాన కార్యదర్శి హరీశ్, నాయకులు నరేశ్, నవీన్, విష్ణు, రాము, రఘు, నరేశ్ తదితరులు ఉన్నారు.